సాక్షి సూర్యాపేట

మంగళవారం ၊ 25 ၊ జూన్ ၊ 2024



జూనియర్ డాక్టర్ల సమ్మె

డిమాండ్ల సాధన కోసం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. - 8లో



విచారణ జరిపించాలి

నీట్, నెట్‌లో అక్రమాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. - 8లో

గరిష్టం / కనిష్టం

34°/26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హామీల అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి విమర్శించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేసిన పాపాన పోలేదన్నారు. రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. వానాకాలం సీజన్‌లో రైతాంగానికి కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు సబ్సిడీ ధరకు రైతులకు అందజేయాలని డిమాండ్ చేశారు. సాగు సీజన్ ప్రారంభం అయినందున రైతులు పెట్టుబడికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం వెంటనే రైతుభరోసా జమ చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ




నల్లగొండ రూరల్ : ఉమ్మడి జిల్లా ఆర్టీసీ ఆర్‌ఎంగా ఎం.రాజశేఖర్ సోమవారం నల్లగొండలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. నల్లగొండ రీజియన్ వంద శాతం కంటే ఎక్కువ ఓఆర్ ఉండి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని.. ఇదే ఒరవడి కొనసాగించాలన్నారు. ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, ఆర్టీసీ అభివృద్ధికి అంకితభావంతో పని చేయాలని కోరారు. అనంతరం డిపోను పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీవీఎం శివకుమార్, మాధవి పాల్గొన్నారు.

ప్రమోషన్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

సూర్యాపేటటౌన్ : ప్రమోషన్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో డీఈఓ అశోక్‌కు పలు సమస్యలపై సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఉపాధ్యాయుడి సర్టిఫికెట్ వెరిఫికేషన్ 100శాతం ధ్రువీకరణ అయిన తర్వాతనే ఇవ్వాలన్నారు. స్వీకరించిన అభ్యంతరాలను సమగ్రంగా విచారించి పరిష్కరించాలన్నారు. 10శాతం రిజర్వేషన్లు తప్పని సరిగా అమలు చేయాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో తలెత్తిన సమస్యలను వీలైనంత త్వరగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీయూఎస్ జిల్లా అధ్యక్షుడు రామానాయక్, భగ్గులాల్, వెంకన్ననాయక్, బాలాజీ నాయక్, చందునాయక్, బాలు నాయక్ పాల్గొన్నారు.

సాగర్ డ్యాం ఆర్‌ఐగా విజయ్‌కుమార్



నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ డ్యాం ఆర్‌ఐగా ఎస్.విజయ్‌కుమార్ సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎస్‌పీఎఫ్(స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. ఈయన స్థానంలో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎస్.విజయ్‌కుమార్‌కు ఆర్‌ఐగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

శివుడికి రుద్రాభిషేకం, బిల్వార్చన

యాదగిరిగుట్ట : యాదాద్రి ప్రధానాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన చేశారు. ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, నిత్యకల్యాణం, సుదర్శన హోమం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

ప్రత్యేక పాలనే..!

జూలై మొదటివారంలో ముగియనున్న ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం

- మండల, జిల్లా పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమించే అవకాశం
- ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ప్రత్యేక పాలన
- అక్టోబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండొచ్చని చర్చ



సూర్యాపేట జిల్లా పరిషత్ కార్యాలయం

మండలాలు	ఎంపీపీలు
23	23
జెడ్పీటీసీలు	ఎంపీటీసీలు
23	213
గ్రామ పంచాయతీలు : 475	

సూర్యాపేటటౌన్ : మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక ఎన్నికలు ఇప్పట్లో జరిగే పరిస్థితులు కన్పించడం లేదు. జిల్లాలో ఇప్పటికే సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. వచ్చే నెల 4తో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగియనుంది. ఇక మండల, జిల్లా పరిషత్‌లకు కూడా ప్రత్యేక అధికారులు పాలన తప్పేలా లేదు.

జిల్లాలో 23 మంది జెడ్పీటీసీలు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో 213 మంది ఎంపీటీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే 23 మండలాల్లో 23 మంది ఎంపీపీలు, 23 మంది జెడ్పీటీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఇందులో మెజారిటీ సభ్యులందరూ బీఆర్‌ఎస్ నుంచే గెలుపొందడంతో ప్రస్తుతం జెడ్పీ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లు ఇద్దరు బీఆర్‌ఎస్ నుంచే ఉన్నారు. కాగా ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొంత మంది ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. అయితే అసెంబ్లీ, పార్లమెంట్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు వరుసగా రావడంతో మూడు నెలల పాటు కోడ్ అమలులో ఉండటంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. దీంతో ప్రభుత్వం మళ్లీ ఎన్నికలు పెట్టాలంటే కోడ్ వస్తుంది. అందువల్ల ప్రభుత్వం ఇప్పటికిప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించే అవకాశం కనిపించడం లేదు.

అక్టోబర్‌లో జరిగేనా..!

జూలై 3వ తేదీన ఎంపీపీలు, ఎంపీటీసీలు, 4వ తేదీన జెడ్పీటీసీల పదవీ కాలం ముగియనుంది. బీసీ జన గణన తర్వాతే గ్రామ పంచాయతీ, ప్రాదేశిక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరో వైపు అక్టోబర్‌లో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్ల ఆధారంగానే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కానీ అలా కుదరకపోవచ్చని అధికార పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న పంచాయతీ, ప్రాదేశిక స్థానాల రిజర్వేషన్లు పదేళ్లు వర్తించేలా చట్టం రూపొందించి అమలు చేసింది. దాన్ని రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్ల ప్రక్రియ చేపడతారా..? పాత విధానాన్ని అమలు చేస్తారా...? అన్నదానిపై కూడా స్పష్టత రావాల్సి ఉంది.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా



హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్, చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల మున్సిపాలిటీలపై అధికారులతో సమీక్ష

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తానని, ఆ పనులు వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, ఎంఏ యూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌లతో కలిసి హుజూర్‌నగర్, కోదాడ, నేరేడుచర్ల మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షించి మాట్లాడారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో ఈద్గా, శ్మశాన వాటికలు, సీసీ రోడ్లు, గోవింద పురం వద్ద బ్రిడ్జి నిర్మాణం, ధోబీ ఘాట్ నిర్మాణం కోసం టెండర్లు పూర్తి అయినందున ఆయా పనులు వెంటనే ప్రారంభించాలని చెప్పారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటీకి ఒక స్వీపింగ్ మిషన్ మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్, టౌన్‌హాల్ నిర్మాణం, ఖమ్మం ఎక్స్ రోడ్ జంక్షన్ అభివృద్ధి, హైదరాబాద్ రోడ్, విజయవాడ రోడ్లలో స్వాగత తోరణాల (ఆర్చ్‌ల) నిర్మాణం, చెరువుకట్ట బజార్ నుంచి అనంతగిరి రోడ్ వరకు మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి నిధులు విడుదల చేయనున్నట్లు వివరించారు. అదనపు ఔట్ సోర్సింగ్ శానిటరీ సిబ్బంది మంజూరుకు ఆమోదం తెలిపామన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీలో మార్కెట్ కార్యాలయం నుంచి జాన్‌పహాడ్ రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం, జాన్‌పహాడ్ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆస్పత్రి వరకు సీసీ రోడ్డు, సరస్వతి శిశు మందిర్ నుంచి కనకదుర్గ గుడి వరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఎన్‌టీఆర్ నగర్ వరకు సీసీ రోడ్డు, లైటింగ్, కనకదుర్గ గుడి వద్ద నుంచి హిందూ శ్మశాన వాటిక వరకు సీసీ రోడ్డు నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు గెల్లి అర్చన రవి, బచ్చలకూరి ప్రకాష్, ప్రమీల రమేష్, వైస్ చైర్మన్లు కోతి సంపత్‌రెడ్డి, అలక సరిత, కోటేశ్వరరావు, కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రమాదేవి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సన్‌ప్రీత్‌సింగ్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్ : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే తన లక్ష్యమని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతన ఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసులు నూతన ఎస్పీకి గౌరవ వందనం చేశారు. ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్మ్‌డ్ ఏఎస్పీ జనార్దన్‌రెడ్డితో పాటు పలువురు పోలీస్ అధికారులు ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. వారి రక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. నేరాల తీరుతెన్నులు, సమస్యలపై ఎక్కువగా దృష్టి పెట్టి వాటి నివారణకు కృషి చేస్తామన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచుతామన్నారు. పెట్రోలింగ్‌ను పటిష్టం చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ కార్యకలాపాల నివారణ, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. యువత నేరాలకు పాల్పడకుండా అవగాహన కల్పిస్తామని చెప్పారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, రౌడీ, సస్పెక్ట్ షీట్స్ ఉన్న వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లా ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్య సరిహద్దుగా ఉన్నందున నిఘా కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. రాత్రి వేళ రోడ్లపై ఆకతాయిలను అదుపు చేయాలని, రాత్రి సమయంలో షాప్స్, వ్యాపారాల నిర్వహణ కు సమయపాలన పాటించేలా ప్రణాళికను అమలుచేయాలన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

హుజూర్‌నగర్: ఎన్నెస్పీ కాల్వ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నీటిపారుదల శాఖ సీఈ ఓవీ రమేష్‌బాబు సూచించారు. హుజూర్‌నగర్ శివారులో కొనసాగుతున్న ఎన్నెస్పీ కాలువ సీసీ లైనింగ్ పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పనుల్లో తేడా వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్‌ఈ నర్సింహారావు, ఈఈ శ్రీనివాస్, డీఈ భిక్షం, ఏఈ టి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కాల్వ పనులు పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్‌లతో మాట్లాడుతున్న సీఈ ఓవీ రమేష్‌బాబు

నేరేడుచర్ల మార్కెట్ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

- వైస్ చైర్మన్‌గా సురేష్‌రెడ్డి
- 16 మంది డైరెక్టర్ల నియామకం
- మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ



చైర్‌పర్సన్ విజయలక్ష్మి



వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి

నేరేడుచర్ల: నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా పాలకవీడు మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన గుండ్లపహాడ్ మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ విజయలక్ష్మినర్సింహారావు, వైస్ చైర్మన్‌గా నేరేడుచర్ల మున్సిపాలిటీకి చెందిన తాళ్ల సురేష్‌రెడ్డితో పాటు 16 మంది డైరెక్టర్లను నియమించింది. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్లుగా కొడాలి పాపయ్య, ఎల్లంచెరువు బాల్‌రెడ్డి, షేక్ బాలసైదా, నల్లమల్ల రాకేష్, మచ్చ శ్రీను, అనిరెడ్డి మధుసూదన్ రెడ్డి, అందే రామ కృష్ణ, పగిడిపాటి సైదిరెడ్డి, బాణోతు శ్రీను, దండ సంజీవ రెడ్డి, పోలిశెట్టి వినయ్‌కుమార్, గుమ్మడవల్లి సోమయ్య, చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ మలిగిరెడ్డి రమణారెడ్డి, సూర్యాపేట జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్‌తో పాటు, హుజూర్‌నగర్ ఏడీఏ సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్‌లను నియమించింది. మార్కెట్ పాలక మండలి కాల పరిమితి రెండేళ్లపాటు ఉంటుంది.

ప్రతి అర్జీని పరిష్కరించాలి



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ ప్రియాంక

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : ప్రజావాణిలో ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, బీఎస్ లతతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో ఎన్నికలు పూర్తయినందున అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి అర్జీలపై వారంలో రెండుసార్లు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 68, డీఆర్‌డీఓ 7, డీపీఓ 6, ఇతర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 27 ఇలా మొత్తం 108 దరఖాస్తులు అందినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మధుసూదనరాజు, డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్, డీఈఓ అశోక్, సీపీఓ కిషన్, డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీఎంఓ శర్మ, ఇంజనీరింగ్ అధికా రులు పాల్గొన్నారు.

ఇంటర్ పాఠ్యపుస్తకాల ఊసేలేదు!

- 1వ తేదీ నుంచే జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం
- 24 రోజులుదాటినా మొదలుకాని సెకండియర్ పాఠాలు
- పాఠ్యపుస్తకాలు అందక ఖాళీ చేతులతో వచ్చిపోతున్న విద్యార్థులు
- ఆలస్యంకానున్న ఫస్టియర్ క్లాసులు



ప్రభుత్వ జూనియర్ కాలేజీల వివరాలు	
ఉమ్మడి జిల్లాలో కళాశాలలు	30
సెకండియర్ విద్యార్థుల సంఖ్య	10 వేలు

కోదాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఎప్పుడు పంపిణీ చేస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమై దాదాపు 24 రోజులు పూర్తయినప్పటికీ నేటికీ ఎక్కడ కూడా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించలేదు. దీంతో విద్యార్థులు ఖాళీ చేతులతో కళాశాలలకు వచ్చి వెళ్తున్నారు.

విద్యాసంవత్సరం ప్రారంభమైనా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 30 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా గతేడాది వీటిలో ఫస్టియర్ చదువుతున్న విద్యార్థులు సుమారు 10 వేల మంది ప్రస్తుతం సెకండియర్‌లోకి వచ్చారు. ఈనెల 1వ తేదీ నుంచి ఇంటర్ కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యాసంవత్సరం ప్రారంభంలో అందించాల్సిన పాఠ్యపుస్తకాలను అధికారులు నేటికీ సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే గత సంవత్సరం మిగిలిన కొన్ని పాఠ్యపుస్తకాలను మాత్రం కొన్ని కళాశాలల్లో కొందరు విద్యార్థులకు అందిస్తున్ననట్టు సమాచారం.

మొదలుకాని తరగతులు

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు 20 రోజులుగా తరగతులు ప్రారంభమై కళకళలాడుతున్నాయి. కానీ, ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం మొదటి సంవత్సరం తరగతులు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇప్పటి వరకు కనీస స్థాయిలో విద్యార్థులు చేరకపోవడంతో తరగతులు ఆలస్యంగా ప్రారంభమయ్యేలా ఉన్నాయని అధ్యాపకులు అంటున్నారు. 10వ తరగతి సప్లిమెంటరీ ఫలితాలు వస్తే కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

మధ్యాహ్న భోజనం అందేనా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల కోసం గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని ప్రకటించింది. కానీ, అది అమలుకు నోచలేదు. ఈ విద్యాసంవత్సరమైనా కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తారో లేదోనని విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న తమకు వెంటనే పాఠ్యపుస్తకాలు అందజేసి, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

కనీస వేతనం రోజుకు రూ.వెయ్యి ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



దొండపాడులో అధికారులకు వినతి పత్రం ఇస్తున్న జూలకంటి

హుజూర్‌నగర్ (చింతలపాలెం),మేళ్లచెరువు : సిమెంట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనం రోజుకు రూ. వెయ్యి చొప్పున ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. సోమవారం చింతలపాలెం మండలం దొండపాడులోని జువారి సిమెంట్ పరిశ్రమ పర్సనల్ మేనేజర్ పాటిల్‌కు, అనంతరం మేళ్లచెరువు మండలం రామాపురం పరిధిలోని ప్రియా సిమెంట్ పరిశ్రమ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆయా సిమెంట్ పరిశ్రమల కాంట్రాక్టు కార్మికులతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కార్మికులకు కనీస వేతనం నెలకు రూ .26 వేలు ఇవ్వాలన్నారు. ప్యాకింగ్ ప్లాంట్ లోడింగ్ కార్మికులకు నెలకు 26 డ్యూటీలు కల్పించాలని, 25 శాతం బోనస్ అండ్ గిఫ్ట్ ఇవ్వాలన్నారు. వీరికి కంపెనీ ఉద్యోగుల మాదిరిగా రిటైర్‌మెంట్ పథకం వర్తింపజేయాలని కోరారు. సెలవు రోజు డబుల్ ఓటీ ఇవ్వాలని, కార్మికులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, కంపెనీ గుర్తింపు కార్డులు, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి, జిల్లా సిమెంట్ క్లస్టర్ పరిశ్రమ వర్కర్ల యూనియన్ కన్వీనర్ వి. సైదులు, శీలం శీను, పి. హుస్సేన్, సుందర మౌళీశ్వరరెడ్డి, శౌరి, నాగయ్య, గురవయ్య, జయరాజు, నాగరాజు, ప్రకాష్, శ్రీను పాల్గొన్నారు.

26న గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

భానుపురి (సూర్యాపేట) : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఈనెల 26వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ధర్నాలో గ్రామ పంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఏడాది కాలంగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకురాలు చెరుకు యాకలక్ష్మి, సోమన్న, బుర్ర శ్రీనివాస్, అనంతప్రకాష్, ముత్యాలు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సోమవారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తి కట్టించారు. కల్యాణవేడుకల్లో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా క్షేత్రంలోని శివాలయంలో శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు , బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, రాజేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్ చోరీ

రామగిరి(నల్లగొండ): ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం పెద్దసూరారం గ్రామ పంచాయతీ పరిధిలో నకిరేకల్ హైవే వెంట ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లలోని 360 లీటర్ల ఆయిల్‌ను ఈ నెల 21వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. చోరీకి గురైన ఆయిల్ విలువ సుమారు రూ.45వేలు ఉంటుందని తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి తిప్పర్తి మండల విద్యుత్ ఏఈ రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. రాజు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



నరేందర్‌రెడ్డి (ఫైల్)

బీబీనగర్: మండల కేంద్రంలోని రంగాపురం సమీపంలో సోమవారం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన తుమ్మల నరేందర్ రెడ్డి అలియాస్ రాజిరెడ్డి (51) ఇటీవల మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో సోమవారం గ్రామ సమీపంలోని రైలు పట్టాల పైకి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన తల్లం అశోక్ అలియాస్ శివ ఓ గిరిజన మహిళను గత కొద్దిరోజులుగా భయపెట్టి అత్యాచారానికి పాల్పడుతున్నాడు. అంతేకాకుండా ఫొటోలు తీసి ఆమె భర్తకు పంపిస్తానని బెదిరిస్తుండడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాకముందే పెద్దమనుషుల సమక్షంతో మాట్లాడుతున్న సమయంలో బాధిత మహిళపై చేయి చేసుకున్న పట్టణానికి చెందిన సరికొండ రుషికేశ్వర్‌రాజుపై కూడా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున తదితరులున్నారు.

అదృశ్యమైన వ్యక్తుల్లో ఒకరు మృతి

- షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోనే మృతదేహం వెలికితీత
- మరో వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తున్న పోలీసులు



షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



రహమాన్ (ఫైల్)

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో పనిచేస్తున్న శివ, రహమాన్ ఆదివారం అదృశ్యం కాగా.. రహమాన్(35) మృతదేహం షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోనే సోమవారం లభ్యమైంది. నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ భీషన్న తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌కాలనీ మెయిన్ బజార్‌లో పర్వతనేని నాగేశ్వర్‌రావు అలియాస్ పెద్దబాబు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాడు. పనులు పూర్తి కాకుండానే కాంప్లెక్స్‌ను ఆక్స్‌ఫర్డ్ పాఠశాలకు లీజుకు ఇచ్చాడు. ఈ నెలలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాలను ప్రారంభించారు. పాఠశాల వసతులకు సంబంధించిన పనులు అసంపూర్తిగా ఉండటంతో ఆ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు రాత్రింబవళ్లు వర్కర్లతో పనిచేయిస్తున్నారు. ఈ కాంప్లెక్స్‌లో రహమాన్ ఎలక్ట్రీషియన్‌గా, శివ పెయింటర్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి పది గంటల ప్రాంతంలో రహమాన్ షాపింగ్ కాంప్లెక్స్ యజమాని పెద్దబాబుకు ఫోన్ చేసి రాత్రి అయినా శివ పెయింటింగ్ పనులు చేస్తున్నాడని, ఎందుకు పనిచేస్తున్నావు అని అడిగితే తనతో గొడవ పడుతున్నాడని తెలిపాడు. శివ గురించి పట్టించుకోవద్దని, అతడి పనిని అతడిని చేసుకోనివ్వమని పెద్దబాబు రహమాన్‌కు చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆదివారం ఉదయం పెద్దబాబు షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు వెళ్లేసరికి అక్కడ రక్తపు మరకలు ఉండటం.. శివ, రహమాన్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రక్తపు మరకలు ఉండటంతో శివ, రహమాన్ ఘర్షణ పడి ఒకరినొకరు గాయపర్చుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను పిలిపించి వివరాలు సేకరించారు. సోమవారం ఉదయం షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో దుర్వాసన వస్తుండడం, వీధి కుక్కలు గుంతలు తోడుతుండటం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పోలీసులు పాఠశాల ఆవరణను తవ్వించగా రహమాన్ మృతదేహం బయటపడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రహమాన్‌ను శివనే హత్యచేసి పూడ్చిపెట్టి పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శివ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోనే రహమాన్ మృతదేహాన్ని పూడ్చిపెట్టాడని డాగ్ స్క్వాడ్ ఆదివారమే పసిగట్టినా.. ఆక్స్‌ఫర్డ్ పాఠశాల యాజమాన్యం, షాపింగ్ కాంప్లెక్స్ యజమానితో పోలీసులు కుమ్మక్కై రహమాన్ మృతిచెందిన విషయాన్ని దాచిపెట్టారని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని పాఠశాల ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



మహేష్ (ఫైల్)

భువనగిరి క్రైం: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి మండలంలోని చీమల కొండూర్ గ్రామంలో సోమవారం జరిగింది. వివరాలు.. చీమలకొండూర్ గ్రామానికి చెందిన పల్లెర్ల మహేష్(25) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన మహేష్ సోమవారం తన వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల కాపరులు గమనించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భువనగిరి ఏరియా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు.

గ్రామంలో విషాదఛాయలు..

మృతుడు మహేష్‌కు సమీప బంధువు అయిన అదే గ్రామానికి చెందిన పల్లెర్ల ఎల్లయ్య(60) కూడా సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఇద్దరు సమీప బంధువులు ఒకేరోజు మృతిచెందడంతో చీమలకొండూర్ గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

జాతీయ రహదారిపై దారి దోపిడీ

- కారులో నుంచి రూ. 2.21లక్షలు ఎత్తుకెళ్లిన దుండగుడు
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వద్ద ఘటన
- సీసీ కెమెరాల్లో నమోదైన దోపిడీ దృశ్యాలు

చౌటుప్పల్: దాబా వద్ద కారులో నిద్రిస్తున్న వారి నుంచి రూ.2.21లక్షలను ఓ దుండగుడు చోరీ చేశాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ముడిగొండ మండలం పాండ్రేగుపల్లి గ్రామానికి చెందిన కాట్రాల ఉపేందర్ తన అత్త తిరుపతమ్మ వైద్య చికిత్స కోసం శనివారం తమ గ్రామానికే చెందిన వేరా బాబుతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లారు. తిరుపతమ్మను ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం తర్వాత స్వగ్రామానికి బయల్దేరాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోనే నివాసముండే తమ గ్రామానికే చెందిన పాశం పావని రూ.1.48లక్షలు, కాట్రాల శ్రీను రూ.73వేలు వీరికి ఇచ్చి గ్రామంలోని తమ కుటుంబ సభ్యులకు ఇవ్వాలని సూచించారు. ఆదివారం సాయంత్రం ఉస్మానియా ఆస్పత్రి నుంచి బయల్దేరి రాత్రి 7.30గంటల ప్రాంతంలో దిల్‌సుఖ్‌నగర్‌కు చేరుకున్నారు. అక్కడ ఉపేందర్ స్నేహితుడైన గోవిందరావు కలవడంతో ముగ్గురు కలిసి మద్యం సేవించారు. రాత్రి 9గంటల ప్రాంతంలో అక్కడి నుంచి ఇద్దరూ బయల్దేరారు. మార్గమధ్యలో చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని స్వాతి దాబా వద్ద ఆగి రొట్టెలు తిన్నారు. అనంతరం నిద్ర వస్తుండడంతో డ్రైవింగ్ చేయలేమని భావించి కారును అక్కడే ఆపుకొని ఇద్దరూ కూడా కారులోనే నిద్రించారు. తమ వద్ద ఉన్న నగదును కారు డ్యాష్ బోర్డులో పెట్టుకున్నారు. అర్ధరాత్రి దాటాక 2.40గంటల ప్రాంతంలో మెలుకువ వచ్చి చూడగా.. డ్యాష్ బోర్డులో దాచిన నగదు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాబా ప్రాంగణాన్ని పరిశీలించారు. అక్కడ సీసీ కెమెరాల పుటేజీని చూడగా.. అర్ధరాత్రి సమయంలో స్కూటీపై ఓ దుండగుడు వీరిని వెంబడించినట్లు పోలీసులు గుర్తించారు. అదేవిధంగా కారు డ్యాష్ బోర్డులో దాచి ఉన్న రూ.2.21లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నంబర్ ప్లేట్ లేని 18 బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో సీఐ రాజశేఖర్, ఎస్ఐలు

నకిరేకల్: నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు నకిరేకల్ పట్టణంలో సోమవారం రాత్రి పోలీసులు వావనాల తనిఖీ చేపట్టి నంబర్ ప్లేట్ లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గత నాలుగు రోజులుగా మొత్తం 60 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ రాజశేఖర్ తెలిపారు. నంబర్ ప్లేట్ అమర్చిన అనంతరం సొంత పూచీకత్తుపై వాహనాలను విడుదల చేస్తామని పేర్కొన్నారు. వాహనాల తనిఖీల్లో ఎస్ఐలు సుధీర్‌కుమార్, గోపిక్రిష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బండరాయి మీద పడి యువకుడు మృతి



నజీర్ (ఫైల్)

కనగల్: బండరాళ్లు కొడుతుండగా ప్రమాదవశాత్తు బండరాయి మీద పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కనగల్ మండలంలోని ఇస్లాంనగర్ గ్రామ పరిధిలో సోమవారం జరిగింది. వివరాలు.. ఇస్లాంనగర్ గ్రామానికి చెందిన షేక్ నజీర్(31) వృత్తిరీత్యా బండరాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రోజు మాదిరిగానే సోమవారం గ్రామ పరిధిలోని బండ మీద రాయి కొడుతుండగా కాలుజారడంతో బండరాయి మీద పడి నజీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చుట్టుపక్కల వారు గమనించి 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

డబ్బు రెట్టింపు చేస్తామని మోసం

నల్లగొండ క్రైం: డబ్బు రెట్టింపు చేస్తామని ఓ వ్యక్తిని సొంత బంధువులే మోసం చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తమకు డబ్బులు ఇస్తే రెట్టింపు చేస్తామని నల్లగొండ మండలం చందనపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు చారిని అతడి సమీప బంధువులు నమ్మించారు. ఇది నమ్మిన చారి వారికి మొదటగా రూ.2లక్షలు ఇస్తే వారు రూ.4లక్షలు తిరిగి ఇచ్చారు. దీంతో ఆర్ఎంపీ వైద్యుడు వారికి రూ.33లక్షలు ఇవ్వగా.. రూ.66 లక్షలు ఇస్తామని చెప్పి రెండు అసలు నోట్ల మధ్యలో తెల్ల కాగితాలు పెట్టి ఇచ్చారని బాధితుడు వాపోయాడు. దీంతో తనకు న్యాయం చేయాలని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు.

జూనియర్ డాక్టర్ల సమ్మె



నల్లగొండలో మెడికల్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న జూనియర్ డాక్టర్లు

- ఎమర్జెన్సీ మినహా అన్ని వైద్య సేవలు బహిష్కరణ
- నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ధర్నా
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నల్లగొండ టౌన్: డిమాండ్ల సాధన కోసం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు నిరవధిక సమ్మె చేపట్టారు. సోమవారం అత్యవసర సేవలను మినహాయించి వార్డు, ఓపీ, ఇతర సేవలను బహిష్కరించి మెడికల్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ మెడికల్ కళాశాల డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే అబ్దుల్ సమద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గగన్ పెరుమాండ్ల మాట్లాడుతూ.. జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ నెలనెలా చెల్లించాలని, మెడికల్ కళాశాల వసతిగృహానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలని కోరారు. ఆస్పత్రి క్యాజువాలిటీలో ప్రత్యేకంగా ఏసీలు, అత్యవసర మందులు లేకపోవడం వల్ల రోగులకు సరైన వైద్యం అందించలేకపోతున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే అత్యవసర మందులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న వైద్యులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు వేతనాలను పెంచాలని, ఆస్పత్రిలో వైద్యుల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిత్యానందానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రుత్విక్, సత్యసాయి కృష్ణ, రేవంత్, జాన్వి, బాలు వేమిరెడ్డి, శ్రీనిధి, ప్రశీద, హరీష్, దీపిక, శ్రీవల్లి, కేవీ భరత్, మమత, ఇంద్రాని, దినేష్, శివకుమార్, సంతోష్‌బాబు, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దుతా

- పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ తడక రమేశ్



బాధ్యతలు స్వీకరించిన బ్యాంకు చైర్మన్ తడక రమేశ్

భూదాన్‌పోచంపల్లి: కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని నూతనంగా ఎన్నికైన బ్యాంకు చైర్మన్ తడక రమేశ్ అన్నారు. సోమవారం ఆయన బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. తనకున్న పరిచయాలతో బడా వ్యాపారస్తుల నుంచి డిపాజిట్‌లు పెట్టించడం, రుణాలు ఇప్పించి బ్యాంకు వ్యాపార లావాదేవీలను పెంచుతామని అన్నారు. 28 ఏళ్ల క్రితం స్థానిక వ్యాపారస్తుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఏర్పాటైన పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, నేడు 10 బ్రాంచ్‌లకు విస్తరించడం గొప్ప విషయమన్నారు. వచ్చే ఐదేళ్లలో 30 బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. చైర్మన్‌గా తనకు వచ్చే గౌరవ వేతనాన్ని తడక ఫౌండేషన్ ఏర్పాటు చేసి పేద ప్రజల విద్య, వైద్యం కోసం ఖర్చు చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు రాబోయే రోజుల్లో అర్హులైన వాటాదారులందరికీ ఓటు హక్కు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం, సూరెపల్లి రమేశ్, కొండమడుగు ఎల్లస్వామి, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, ఏలే హరిశంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీట్, నెట్ పరీక్షల కుంభకోణంపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు

సూర్యాపేటటౌన్: దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సుప్రీం కోర్టు జడ్జిచే విచారణ చేపట్టి, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (పీడీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమార్కుల చేతిలో విద్యను పెట్టి విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే చర్యలకు పూనుకున్నారన్నారు. విద్యను ప్రైవేటీకరణ చేసి కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అసమర్థతత మూలంగా 24లక్షల మంది నీట్ విద్యార్థులు, 11లక్షల మంది నెట్ విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం సీబీఐ విచారణ పేరుతో కాలం గడిపి ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనికి పూర్తి బాధ్యత ప్రధాని నరేంద్ర మోదీ వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్. నవీన్, ఉదయ్, హరీశ్, వెంకటేష్, బన్ని, లోకేష్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



మర్రి భగవతి

నిడమనూరు: మండల కేంద్రానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు సోమవారం ఫిర్యాదు అందిందని ఎస్ఐ గోపాలరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన గాజుల చంద్రమౌళి తన కుమార్తె భగవతిని 19సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన మర్రి రవిరాజ్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. ఈ నెల 19వ తేదీన భర్తతో గొడవపడిన భగవతి పుట్టింటికి వచ్చింది. 21వ తేదీ నుంచి ఆమె కనిపించడం లేదు. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో సోమవారం చంద్రమౌళి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భగవతి గతంలో కూడా అదృశ్యం కాగా.. హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కనుగొన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

- 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 150 కేజీల పటిక, 15 కేజీల నల్లబెల్లం స్వాధీనం

కొండమల్లేపల్లి: మండల పరిధిలోని ఆంగోతుతండా, మేగ్యతండా, జోగ్యతండా, జేత్యతండాల్లో దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా మేగ్యతండాలో సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అదేవిధంగా 150 కేజీల పటిక, 15 కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, ఎక్సైజ్ కానిస్టేబుళ్లు స్వామి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి మండలంలో 216 కేజీల నల్లబెల్లం..



భువనగిరి క్రైం: స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, నాటుసారాను చూపుతున్న పోలీసులు

భువనగిరి క్రైం: మండలంలోని పచ్చర్లబోడు తండా, బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామాల్లో నాటు సారా తయారీ స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పది లీటర్ల నాటుసారాతో పాటు 216 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్ తెలిపారు. నాటుసారా తయారు చేస్తున్న పచ్చర్లబోడు తండాకు చెందిన జర్పోతు భగవంత్‌తో పాటు అతనికి బెల్లం, సారా తయారీకి ముడి పదార్థాలను సరఫరా చేస్తున్న పబ్బతి సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ, ఎక్సైజ్ ఎస్ఐలు కె. గణేష్, కె. శ్రీకాంత్, పి. వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

చిట్యాల: మంచినీరు కావాలంటూ ఇంటికి వచ్చిన గుర్తుతెలియని యువకులు మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పంచాయతీ పరిధిలోని పిశాటిగూడెంలో సోమవారం జరిగింది. వివరాలు.. పిశాటిగూడెం గ్రామానికి చెందిన పిశాటి సుగుణమ్మ భర్త గంగాధర్‌రెడ్డి సోమవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లగా.. ఆమె ఇంటి వద్ద ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం సమయంలో నలుగురు యువకులు రెండు బైక్‌లపై సుగుణమ్మ ఇంటి వద్దకు వచ్చి మంచినీరు కావాలని ఆమెను అడిగారు. సుగుణమ్మ మంచినీరు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లగా ఆమె వెనుకే వెళ్లిన ఓ యువకుడు ఆమె మెడలోని మూడు తులాలకు పైగా ఉన్న బంగారు పుస్తెలతాడును లాక్కోని బయటకు వచ్చాడు. అనంతరం ఆ యువకులు కలిసి బైక్‌లపై పరారయ్యారు. జరిగిన విషయాన్ని సుగుణమ్మ భర్తకు తెలియజేయగా.. వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిట్యాల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

మళ్లీ మొదలైన ‘ఫార్మా’ పనులు

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత నిలిపివేత
- వారం క్రితం మళ్లీ ప్రారంభించిన నిర్వాహకులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు



కిష్టాపురం గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఫార్మా కంపెనీ నిర్మాణం

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో సర్వే నంబర్లు 356, 357లోని రెండు ఎకరాల్లో సన్ లైట్ ఆక్టివ్ డ్రగ్ ఇన్‌గ్రీడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు ఏడాది క్రితం ప్రారంభించారు. దీంతో కిష్టాపురం గ్రామస్తులతో పాటు మునుగోడు మండలంలోని ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు దాదాపు 3 నెలల పాటు ఆందోళనలు చేశారు. అంతేకాకుండా కిష్టాపురం గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఆ సమయంలో ప్రచారంలో భాగంగా ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తనను గెలిపిస్తే ఫార్మా కంపెనీ నిర్మాణం నిలిపివేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఫార్మా కంపెనీ యజమాని నిర్మాణ పనులు పూర్తిగా నిలిపివేశాడు.

తిరిగి ప్రారంభం..

ఏమైందో ఏమో కానీ వారం రోజుల క్రితం తిరిగి ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు ప్రారంభించడంతో మునుగోడు మండలం కిష్టాపురంతో పాటు ఇప్పర్తి, కోతులారం, చిట్యాల మండలం పేరపల్లి, ఏపూరు, సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేల్, గుజ్జ గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరు గ్రామాల్లో దాదాపు 15వేలకు పైగా జనాభా నివాసముంటున్నారు. అందులో దాదాపు 80శాతం ప్రజలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి భూములు కంపెనీ చుట్టూ పక్కనే ఉండటంతో కంపెనీ వెలువడే వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమై తమ పంటలు నాశనమవుతాయని భయపడుతున్నారు. అంతేకాకుండా ఉదయం, రాత్రి సమయంలో వెలువడే ఘాటు వాసన పీల్చి జీవించలేమని వాపోతున్నారు. ఎలాగైనా సరే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు వెంటనే నిలిపివేయాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

వ్యర్థ రసాయనాలు వదిలేందుకే..

మునుగోడు మండలం కిష్టాపురం గ్రామంలో పెద్ద వాగు ప్రారంభమవుతుంది. ఆ వాగుని ఆనుకుని నూతనంగా ఈ ఫార్మా కంపెనీ నిర్మాణం కొనసాగిస్తున్నారు. ఆ కంపెనీ నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలను వాగులో వదిలేయవచ్చని నిర్వాహకులు ఆలోచిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కంపెనీ పనులు పూర్తయితే దాని చుట్టూ మరో ఐదారు కంపెనీలు ఏర్పాటు చేసేందుకు పలువురు వ్యాపారులు అనుమతి తీసుకుని అవసరమైన భూమిని సైతం కొనుగోలు చేసినట్లు తెలిసింది.

వారం క్రితం పనులు ప్రారంభించారు



ఆరు నెలల పాటు పూర్తిగా నిలిపివేసిన ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు తిరిగి వారం రోజుల క్రితం ప్రారంభించారు. దీంతో మా గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు చొరవ తీసుకొని కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలి.

– నందిపాటి వెంకన్న, కిష్టాపురం

పనులు నిలిపివేయాలి



కిష్టాపురం గ్రామంలో చేపట్టిన ఫార్మా కంపెనీ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలి. ఈ కంపెనీ ఏర్పాటైతే మునుగోడు ఎడారిగా మారుతుంది. పనులు నిలిపివేయకపోతే గతంలో చేసినదాని కంటే తీవ్రంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– నెల్లికంటి సత్యం, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి